
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
బుధవారం 31 జూలై 2024



భీమవరం ఏఎంసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

'ఉచిత బస్సు'పై పునరాలోచన చేయాలి : ఆటో డ్రైవర్ల డిమాండ్


భీమవరం క్రైం, జూలై 30 : ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు యింటి సత్యనారాయణ కోరారు. మంగళవారం భీమవరం ఏఎంసీ కార్యాలయం వద్ద జిల్లా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు జీవితాలు అగమ్యగోచరంగా మారాయన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పంపన గోపి మాట్లాడుతూ 10 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఈ ఉచిత బస్సు ప్రయాణంలో నష్టపోతున్నారని, ప్రభుత్వ డ్రైవర్లకు ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. తలారి వాసు, సంజయరావు, సల్మాన్‌రాజు, యిర్రింకి సురేష్, వాసు, ఆరేపల్లి బాలాజీ, విప్పర్తి వెంకటరావు, స్నేహమిత్ర, గణపవరం ప్రసన్న, మొగల్తూరు స్నేహ ఆటో యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణం పరిరక్షించాలి

» ఆర్డీవో ఖాజావలి

ఏలూరు క్రైం/కైకలూరు, జూలై 30: పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని ఆర్డీవో ఖాజావలి కోరారు. కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఖరారుకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు మంగళవారం జరిగింది. ఆర్డీవో మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో మత్స్యకార సంఘాలు, ఇతర స్థానిక వర్గాలకు జీవనోపాధి భద్రత కల్పించడంతోపాటు తీర ప్రాంతాలు, సముద్ర ప్రాంతాల ప్రత్యేక పర్యావరణాన్ని రక్షించడం ప్రధాన లక్ష్యమన్నారు. సముద్ర తీర ప్రాంతం కలుషితం కాకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజల సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలను సీఆర్‌జెడ్ పరిధి నుంచి తప్పించి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని చేపల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాడినాడ బాబు అన్నారు. ఆక్వా కల్చర్‌పై ఆంక్షలుంటే ముందుగానే రైతులకు వివరించాలని కోరారు. పలువురు రైతులు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంపై సరైన సమాచారం లేదని, ప్రజలు, రైతులంతా పాల్గొనలేకపోయారని ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు అన్ని గ్రామాల సర్పంచ్‌లకు సమాచారం అందించినట్లు తప్పుదారి పట్టిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కె.వెంకటేశ్వరరావు, పీవీబీఎల్.శాస్త్రి, ఎన్‌సీఎస్ఈ సౌందర్య రాజన్, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఫారెస్ట్, టూరిజం, మత్స్యశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ, రెవెన్యూ, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గృహయోగం



అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలందరికీ స్థలాలు ఇచ్చి, ఇల్లు నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల భూమిని పట్టాల రూపంలో ఇచ్చి, నాలుగు లక్షలతో గృహాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ పేదలకు సెంటు, గ్రామీణ ప్రాంత లబ్ధిదారులకు సెంటున్నర భూమి ఇచ్చి ఇళ్ల నిర్మాణం ప్రారంభించినా 50 శాతం కూడా పూర్తి చేయలేదు.

కూటమి సర్కారు తీపి కబురు

» గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు
» పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం మంజూరు
» నిర్మాణ సాయం రూ.4 లక్షలు.. పేదవర్గాలు హర్షాతిరేకం

భీమవరం టౌన్/తాడేపల్లిగూడెం రూరల్, జూలై 30 : ఇళ్ళ నిర్మాణం పూర్తి కాకపోవడంలో అప్పటి వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలే ఇబ్బందిగా మారాయి. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలు మినహా అదనంగా ఒక్క పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వలేదు. ఇసుకను మాత్రం ఉచితంగా ఇచ్చారు. మూడేళ్లుగా పెరిగిన గృహ నిర్మాణ వ్యయంతో సెంటున్నర భూమిలో నాలుగు నుంచి ఐదు లక్షల వరకు అంచనాలు పెరగడంతో లబ్ధిదారులు చేతులు ఎత్తేశారు. పట్టణాల్లో కేవలం సెంటు స్థలమే మంజూరుచేశారు. ఇక్కడ గృహాన్ని నిర్మించే పరిస్థితి క్లిష్టతరం కావడంతో లబ్ధిదారులు అంతంతమాత్రంగానే ముందుకు వచ్చారు. పైగా పట్టణానికి నాలుగు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో వీటిని కేటాయించడంతో పట్టణ పేదలు పెద్దగా ముందుకు రాలేదు. గృహ నిర్మాణం అనుకున్న స్థాయిలో ముందుకు సాగలేదు. కొన్నిచోట్ల కాలనీకి సరైన మార్గం లేకపోవడం లబ్ధిదారుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమైంది.

లే ఔట్‌ల పూడిక ఎలా ?

పట్టణాల్లో పేదల స్థలాలకు అత్యధికంగా భూములు కొనుగోలు చేశారు. చాలాచోట్ల వీటి పూడిక అసంపూర్తిగానే ఉండిపోగా, కొన్నిచోట్ల తట్ట మట్టి కూడా వేయలేదు. జిల్లాలో అత్యధికంగా భీమవరం, నరసాపురం, తణుకు, పాలకొల్లు ప్రాంతాల్లో ఉన్నాయి. మట్టిపూడిక పేరుతో గ్రామీణ ప్రాంతాల నుంచి మట్టిని తరలించే నెపంతో అప్పటి వైసీపీ నాయకులు వాటిని అమ్ముకున్నారనే ఆరోపణలు వచ్చాయి. జిల్లాలో మొత్తం 603 లే-అవుట్‌లు ఉన్నాయి. భీమవరం పట్టణ శివారు దిరుసుమర్రు రోడ్‌లో 73.5 ఎకరాలు భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిని పేదలకు ఇవ్వడానికి ప్రాథమికంగా పట్టాలు సిద్ధం చేసి అందజేశారు. మట్టి పూడిక లేకపోవడంతో ఎవరి స్థలం ఎక్కడో ఎవరికీ తెలియని పరిస్థితి ఉంది కేవలం రాళ్లు పాతి వదిలేశారు. ఇక్కడ నాలుగు వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు ఇవ్వాల్సి ఉంది.

మూడు కేటగిరీలు

అప్పట్లో ఇళ్ళ నిర్మాణానికి ఎంత హడావుడి చేసినా చాలా చోట్ల లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో వైసీపీ ప్రభుత్వం పేదల గృహ నిర్మాణానికి మూడు కేటగిరీలుగా విభజించింది. ఇందులో ఏ కేటగిరీలో లబ్ధిదారుడే పూర్తిగా నిర్మించుకోవడం. ఈ ప్రభుత్వం 1.80 లక్షలు మాత్రమే ప్రభుత్వం ఇస్తుంది. దీనికి ఇటుక, సిమెంటు ప్రభుత్వం ఇచ్చింది. బి-కేటగిరి విభాగంలో గృహాన్ని ప్రభుత్వమే నిర్మించి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. సి కేటగిరి విభాగంలో ఇందులో కొంత సొమ్ము లబ్ధిదారుడి వాటాతో ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతో కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో గృహ నిర్మాణం చేపట్టేలా నిర్ణయించి నిర్మాణాలు ప్రారంభించారు. ఇలా మూడు కేటగిరీల విధానంలో సైతం ప్రభుత్వం చేపట్టి నిర్మాణం ముందుకు సాగలేదు. పైగా ప్రారంభ సమయంలో ఉన్న నిర్మాణంతో బాగా జాప్యం సాగింది. అప్పట్లో కొంత మంది కాంట్రాక్టర్లు ఉత్సాహంగా ముందుకు వచ్చి నిర్మాణాలు చేశారు. పైగా కాంట్రాక్టర్లు తగిన రీతిలో ముందుకు రాకపోవడంతో 11 వేల గృహాలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో ప్రభుత్వం 68 వేల 945 ఇళ్లకు మంజూరుపత్రాలు ఇవ్వగా వాటిలో 28 వేల 261 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 40,684 పూర్తి కావాల్సి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం 4,907 ఇళ్లు కట్టేందుకు ప్రజలు ముందుకు రాలేదు.

పేదల్లో ఆనందం

ఇటువంటి పరిస్థితుల్లో ఈ గృహ నిర్మాణాన్ని నిర్మాణ వ్యయం పెంచి స్థలాన్ని కూడా పెంచి విశాలమైన నిర గృహాన్ని ప్రభుత్వమే నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంతో లబ్ధిదారులలో ఆశలు పెరిగాయి.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందానే దానిపై ఆశగా ఉన్నారు. ప్రస్తుతం ఇళ్ళస్థలం వచ్చిన లబ్ధిదారుల పరిస్థితి ఎలా అనేదానిపై ఆలోచన చేస్తున్నారు. ప్రకటించిన స్థలానికిగతంలో ఇచ్చిన స్థలానికి తేడా ఉండటంతో పాత స్థలంలో మాత్రమే నిర్మాణంచేసుకోవాలా, కొత్తగా ఏమైనా స్థలం పెంచుతారాలేదా, పెంచిన 4లక్షలు ఈ ఇళ్ళకు ఇస్తారా అనేదానిపై స్పష్టత కోసం చూస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.



అన్నీ ఇబ్బందులే..

వైసీపీ ప్రభుత్వం నిర్మించిన కాలనీలో నివాసం ఉంటున్న లబ్ధిదారులు కనీస సౌకర్యాలు లేక ఘొల్లుమంటున్నారు. సరైన రోడ్డు, మంచినీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు అరకొరగా ఉండటంతోపాటు జిల్లా కొన్నిచోట్ల రహదారి సమస్యలు కూడా ఉత్పన్నం కావడంతో విసుగెత్తిపోయారు.

• కట్టిన ఇల్లు అమ్ముకునే పరిస్థితి



వి.పద్మ, కాలనీ లబ్ధిదారు

మాకు సెంటు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేసుకోవాలని అధికారులు చెప్పారు. స్థలం వెనక్కి తీసుకుంటారనే భయంతో చేతిలో డబ్బు లేకపోయినా అప్పు చేసి ఇల్లు కట్టాం. మాకు ప్రభుత్వం నుంచి వచ్చే సాయం లక్షలోపే వచ్చింది. ఇల్లు పూర్తయ్యి ఏడాదిన్నర గడుస్తున్నా మిగిలిన బిల్లులు పడటం లేదు. హౌసింగ్ ఆఫీసుకు వెళితే ఆన్‌లైన్‌లో సమస్య వచ్చిందని చెబుతున్నారు. మాకు అప్పులు ఇచ్చినవారు వడ్డీ కట్టలేదని మాపై కోర్టుకు వెళ్లారు. కట్టుకున్న ఇల్లు తెగనమ్ముకోవాల్సి వచ్చింది.

• మాలాంటి పేదలకు వరం



కూటమి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు రెట్టింపు చేయడంతోపాటు, సాయం రెట్టింపు ఇచ్చే నిర్ణయం మాలాంటి పేదలకు వరం. తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఇళ్ల కేటాయింపు చేసి సాయమందిస్తే పేదలందరికీ సొంతింటి కల తీరినట్టే. ఈ సాయం వల్ల అప్పులు లేకుండా ఇల్లు కట్టుకునేందుకు అవకాశం లభిస్తుంది.

- కె.త్రిమూర్తులు, కొండ్రుప్రోలు



క్రాప్ హాలిడే దిశగా..

ఆచంట వేమవరంలో ముంపులో పొలాలు

వర్షం.. నష్టం రూ.40 కోట్లు

» 29 వేల ఎకరాల్లో నాట్లకు పూర్తి దెబ్బ
» 1,456 ఎకరాల నారుమడులు పనికిరావు
» 20 వేల ఎకరాల్లోని నాట్లకే ఇన్‌పుట్ సబ్సిడీ !
» విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు

భీమవరం రూరల్, జూలై 30 : ఎడతెరిపి లేని భారీ వర్షాలు, వరదలు రైతుల పాలిట శాపంగా మారాయి. దాళ్వా సాగుకు అపారనష్టాన్ని చేకూర్చాయి. నాట్లుతోపాటు నారుమడులు పనికి రాకుండా పోయాయి. దీంతో సార్వా నారుమడులు, నాట్లు దశలోనే సాగు నష్టం ఏకంగా రూ.40 కోట్లకు చేరింది. సాగుకు ముందుకు వెళ్ళాలా ? క్రాప్ హాలిడే ఇవ్వాలా అని రైతులలో సందిగ్ధత నెలకొంది. డెల్టాలోని పల్లపు ప్రాంతాలలో ఇంకా రెండు మూడడుగుల లోతు నీరు ఉండిపోవడం సాగుకు కష్టసాధ్యంగా మారింది. వర్షాల ముందు సార్వా సాగు జిల్లాలో 35 వేల ఎకరాల వరకు నాట్లు వేశారు. 15 రోజులు ఎడతెరిపి లేని వర్షాలతో 29,505 ఎకరాలు పది రోజులకుపైగా ముంపులోనే ఉన్నాయి. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం 20 వేల ఎకరాలు నెల రోజులకుపైబడి నాట్లు వేసినవిగా నమోదు చేశారు. ఈ లెక్కన వీటికి ఇన్‌పుట్ సబ్సిడీ అందే అవకాశం ఉంటుంది. పూర్తిస్థాయిలో దెబ్బ తిన్న నాట్లు నమోదు ప్రక్రియ రెండు, మూడు రోజుల్లో మొదలు కానున్నదని జిల్లా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. 9,505 ఎకరాలు 10 నుంచి 15 రోజులు నాట్లు వేసినవిగా లెక్క వేశారు. ఈ సాగుకు ఇన్‌పుట్ సబ్సిడీ లెక్కలోకి రాదు. నారుమడులు 1,450 ఎకరాలలో పూర్తిగా దెబ్బ తిన్నాయి. మరోసారి నారుమడులు వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి విత్తన ఇండెంట్ పెట్టారు. తక్కువ రోజుల వ్యవధిలో పంటకు వచ్చే విత్తనాలను ఎంపిక చేశారు. ఈ ప్రకారం ఎంటీయూ-1153 రెండు వేల 500 క్వింటాళ్ళు, ఎంటీయూ-1156 రకం 850 క్వింటాళ్లు, ఎంటీయూ 1010 రకం 120 క్వింటాళ్లు, స్వర్ణ 60 క్వింటాళ్లు ఇండెంట్ పెట్టారు. విత్తనాలు పూర్తిస్థాయి సబ్సిడీ రూపేణా ఇస్తారా ? లేక ధర తగ్గించి ఇస్తారా అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

ఇప్పుడు వేసినా పంట చేతికొచ్చేనా ?

జిల్లాలో సార్వా సాగు రెండు లక్షల 11 వేల ఎకరాల్లో సాగు జరుగుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. సాగు, నారుమడుల దశ నుంచి అల్ప పీడనాల వల్ల ఎడతెరిపి లేని వర్షాలు పడటంతో నారుమడులు రక్షించుకోవడంలో రైతులను ఇబ్బందులకు గురిచేసింది. నాట్లు వేసిన వారి పరిస్థితి అలాగే ఉంది. చివరికి 40 రోజుల సమయం వృథా అయ్యింది. చివరికి సాగు మొదటికి వచ్చింది. దాదాపు 90 శాతంపైగా సాగు నాట్లు వేయాల్సి ఉంది. వీటిలో 50 శాతం వరకు మరోసారి నారుమడులు వేయాలి. డెల్టాలో పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు తగ్గాలంటే మరో పది రోజులు సమయం పడుతుంది. ఈ విధంగా చూస్తే ఆగస్టు 10వ తేదీ నుంచి నారుమడులు వెయ్యడం జరిగితే డిసెంబరు చివరిలో గాని పంట మాసుళ్ళకు రాదు. ఈలోగా వాతావరణం అనుకూలించకపోతే మరికొన్ని ఇబ్బందులు మరోసారి నష్టం చవిచూడాల్సిందే. ఈ లెక్కలతో డెల్టాలోని సగం మంది రైతులు క్రాప్ హాలీడే ఇచ్చే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే నారుమడులు వేసిన రైతులు వేల రూపాయలు, నాట్లు వేసిన రైతులు ఎకరానికి పది వేల నుంచి 15 వేల వరకు నష్టాలు చవిచూశారు.



గోదావరి దోబూచులాట

భద్రాచలం వద్ద పెరుగుతూ.. ధవళేశ్వరం వద్ద తగ్గుతూ..

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం/పెనుగొండ/ఆచంట/నరసాపురం టౌన్, జూలై 30 : గోదావరి పెరుగుతూ.. తగ్గుతూ.. దోబూచులాట ఆడుతోంది. మహారాష్ట్రలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో భద్రాచలం వద్ద మంగళవారం ఉదయం ఐదు గంటలకు 42.70 అడుగులు వున్న నీటిమట్టం సాయంత్రానికి నెమ్మదిగా పెరుగుతూ 43.70 అడుగులకు చేరింది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలు భయాందోళనతో ఉన్నారు. ఇంకా లోతట్టు ప్రాంతాలు నీటిలోనే ఉన్నాయి. పోలవరంలో నీటిమట్టం 23.337 మీటర్లకు చేరడంతో 10 లక్షల క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 32.710 మీటర్లు, దిగువన 24.300 మీటర్లు నమోదైంది. పట్టిసీమ ఎత్తిపోతల నుంచి 20 పంపులతో 6,726 క్యూసెక్కుల గోదావరి వరద జలాలు దిగువకు విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. 12 లక్షల క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. పెనుగొండ మండలం సిద్దాంతం వశిష్ట గోదావరి తగ్గుముఖం పట్టింది.లంక భూములు ఇంకా నీటిలోనే ఉన్నాయి. పశుగ్రాసం, కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆచంట మండలం లంక గ్రామాల్లో నీట మునిగిన ప్రాంతాలు తేరుకుంటున్నాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయం బురదమయంగా మారింది. గోదావరి తగ్గుతున్నప్పటికి ప్రవాహం ఇంకా ఎక్కువగానే ఉంది. నరసాపురం లోని అన్నిరేవుల వద్ద మెట్లను తాకుతూ వశిష్ట పరవళ్లు తొక్కుతోంది. పింఢాల రేవు, లలితాంబ, కొండాలమ్మ రేవులన్నీ నీట మునిగాయి. కొత్త నవరసపురం ఎస్టీ కాలనీలో వరద నీరు తగ్గలేదు. శానిటేషన్ సమస్య తలెత్తకుండా మునిసిపల్ సిబ్బంది బ్లీచింగ్, ముగ్గు చల్లారు. వరద పరిస్థితిని కమిషనర్ వెంకటేశ్వరావు, ఏటిగట్టు శాఖల ఏఈ సుబ్బారావు పర్యవేక్షిస్తున్నారు.

పొంగిన నక్కల కాలువ

ఆచంట, జూలై 30 : గోదావరి ఉధృతి, భారీ వర్షాల కారణంగా ఆచంట వేమవరంలోని నక్కల కాలువ మంగళవారం పొంగి పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. వేమవరంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నీట మునిగింది. ఈ కారణంగా ఆచంట-పాలకొల్లు మార్గంలోని వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఇక్కడ పరిస్థితి ఇంత భయానకంగా ఉన్నప్పటికీ అధికారులు కనీసం స్పందించకపోవడంపై వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా నక్కల కాలువ ఉధృతికి రైతులు తీవ్రంగానే నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.



నక్కల డ్రెయిన్ ఉధృతి కారణంగా వేమవరం వద్ద రోడ్డుపైకి చేరిన వరద నీరు.. వాహనదారుల అవస్థలు

ఈసారి బియ్యం, గోధుమ పిండి మాత్రమే పంపిణీ

» రేపటి నుంచి ఇంటింటికి రేషన్

ఉండి, జూలై 30 : ఆగస్టు ఒకటి నుంచి ఇంటింటికి రేషన్ సరఫరాకు ప్రభుత్వం ఏర్పాట్లుచేసింది. ఈ నెలకు సంబంధించి బియ్యం, గోధుమపిండి మాత్రమే ఇవ్వనున్నారు. పంచదార, కంది పప్పు ప్యాకెట్ల తూకం సరిగాలే నందున రెండు నెలలు నుంచి వీటి పంపిణీని నిలిపివేశారు. వీటిని సరిచేసి వచ్చే నెల నుంచి పూర్తిస్థాయిలో సరఫరా చేస్తారు. ఆగస్టు 1వ తేదీ గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఇంటింటికి రేషన్ సరుకులను పంపిణీ చేయాలని కలెక్టరు నాగరాణి సివిల్ సప్లయిస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు గ్రామాల వారీగా రేషన్ దుకాణాలకు సరుకులను సరఫరా చేశారు. ఐదు లక్షల 65 వేల 651 కార్డుదారులకు ఎనిమిది వేల 190 టన్నుల బియ్యాన్ని సరఫరాచేశారు. వీటిని కార్డుదారులకు ఉచితంగా ఇవ్వనున్నారు. గోధుమ పిండి ప్యాకెట్‌కు రూ.16 వసూలు చేస్తారు.

మునిసిపాల్టీల్లో పారిశుధ్య నిర్వహణకు నిధులు విడుదల

భీమవరం టౌన్, జూలై 30: మునిసిపాల్టీల్లోని డ్రెయిన్లలో సిల్టు తొలగింపునకు, డ్రెయిన్ల నిర్మాణాలకు, సీజనల్ వ్యాధులు విజృంభించకుండా ముందుజాగ్రత్తలు తీసుకునేందుకు బీపీఎస్, ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి ప్రభుత్వం నిధులను కేటాయించింది. 2011 జనాభా ప్రాతిపదికన వీటిని విడుదల చేశారు. ఆకివీడు, భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం మునిసిపాల్టీలకు మూడు కోట్ల 94 లక్షల 71 వేలు మంజూరుచేశారు. భీమవరానికి రూ.కోటి 23 లక్షలు, తాడేపల్లిగూడెంకు రూ.89.83 లక్షలు, తణుకుకు రూ.67.52 లక్షలు, పాలకొల్లుకు రూ. 45.76 లక్షలు, నరసాపురానికి రూ.43.88 లక్షలు, ఆకివీడు కు 24.20 లక్షలు మంజూరయ్యాయి. నిధులతో మునిసిపల్ అధికారులు డ్రెన్‌లో సిల్టు తొలగింపు, అవసరమైన చోట డ్రైన్ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేస్తున్నారు.

నరసాపురం రైల్వే స్టేషన్ మాస్టర్‌గా మధుబాబు

నరసాపురం, జూలై 30: భీమవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబును నరసాపురం రైల్వే స్టేషన్ మాస్టర్‌గా నియమిస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీచేసింది. ఆయన గతంలో ఐదేళ్లపాటు ఇదే స్టేషన్ ఎస్ఎంగా పనిచేశారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఎస్ఎం దివాకర్ పదవీ విరమణ చేస్తుండటంతో ఈ నియామకం చేపట్టారు.

రూ.5 వేలు ఇస్తే.. ఇంటి పన్ను రెడీ

నరసాపురం మునిసిపల్ సిబ్బందిపై కౌన్సిల్ గరంగరం



నరసాపురం, జూలై 30 : 'పురపాలక సంఘం అధికారుల పని తీరు ఏ టీషాపుల వద్దకు వెళ్లినా చెప్పుకుంటున్నారు. కొత్తగా ఇల్లు కట్టుకున్న వారికి.. ఇంటి పన్ను కావాలంటే.. రూ.5 వేలు ఇస్తే మేం ఇచ్చేస్తాం' అంటూ పురపాలక పరువును కొందరు సిబ్బంది తీస్తున్నారంటూ వైసీపీ కౌన్సిలర్ సఖినేటిపల్లి సురేష్ మండిపడ్డారు. మంగళవారం చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆరంభం నుంచి అక్రమ కట్టడాలు, అధికారుల పనితీరుపై చర్చ సాగింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఇంటి పన్ను వ్యవహారంపై మరోసారి ఇలాంటి తప్పిదాలు జరగకుండా కమిషనర్ వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. 26వ వార్డులో పురపాలక స్థలంలో అక్రమంగా దిమ్మలు కడుతున్నారంటూ దిలీప్ సభ దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, జనసేన కౌన్సిలర్లు సురేష్, సూర్యకుమారి, అరుణ, వైసీపీ కౌన్సిలర్ వన్నెంరెడ్డి, స్వతంత్ర సభ్యులు కోటిపల్లి సురేష్ అభ్యంతరం తెలిపారు. ముందు పట్టణంలోని అక్రమ దిమ్మలతోపాటు కట్టడాలు తొలగించాలని డిమాండ్ చేశారు. వైసీపీ కౌన్సిలర్లు దిలీప్, జయరాజు, రాజశేఖర్, కేసరి గంగరాజు మాట్లాడుతూ గతంలో జరిగినప్పుడు ఏం చేశారంటూ ప్రశ్నించారు. దీంతో వీరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ జోక్యం చేసుకుని సర్వే చేసి చర్యలు తీసుకుంటామని సభ్యులకు నచ్చజెప్పారు. గత కౌన్సిల్‌లో తీసుకొచ్చిన సమస్యల పరిష్కారం ఏమైందంటూ వీసీ కొత్తపల్లి నాని ప్రశ్నించారు. శానిటేషన్, తాగునీరు, విద్యుత్ లైట్లను మెరుగుపర్చాలన్నారు.

నెలన్నరలో 72 మందికి పదోన్నతులు : ఐజీ

ఏలూరు క్రైం, జూలై 30 : ఏలూరు రేంజ్ పరిధిలోని గడిచిన 42 రోజుల కాల వ్యవధిలో మొత్తం 72 మంది పోలీస్ సిబ్బందికి పదోన్నతులు కల్పించినట్లు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. పదోన్నతులు పొందిన వారిలో ముగ్గురు ఎస్‌ఐలకు ఇన్‌స్పెక్టర్లుగా, 36 మంది హెచ్‌సీ/ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించామన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు సంబంధించి 17 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతి ఇచ్చామన్నారు. ముగ్గురు ఏఆర్ఎస్‌ఐలకు ఆర్ఎస్‌ఐలుగా, 12 మంది ఎఆర్ హెడ్ కానిస్టేబుళ్ళకు ఏఆర్ ఎస్‌ఐలుగా పదోన్నతులు ఇచ్చామన్నారు. ఒక సీనియర్ అసిస్టెంట్‌కు ఆఫీసర్ సూపరింటెండెంట్ పదోన్నతి కల్పించామన్నారు. పదోన్నతులు పొందిన వారిలో ముగ్గురు ఏఎస్‌ఐలు జూన్ నెలలో రిటైరవగా, బుధవారం మరొకరు పదవీ విరమణ చేయనున్నారు. వారికి ఎస్‌ఐలుగా పదోన్నతి వచ్చే విధంగా డిప్యూటేషన్ విభాగాధి పతులతో మాట్లాడి వారి వద్ద ఉన్న ఖాళీలను కూడా భర్తీ చేసి వారికి పదో న్నతులు ఇచ్చామన్నారు. త్వరితగతిన రికార్డులు తనిఖీ చేసి ప్రకియకు సహకరించిన డీఐజీ కార్యాలయ మేనేజర్ నాగరాజు, రేంజ్ కార్యాలయ సిబ్బందిని ఐజీ అభినందించారు.


పోటీ బ్రోచర్‌తో నిర్వాహకులు, విద్యార్థినులు

స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా స్థాయి పోటీలు

భీమవరం టౌన్, జూలై 30 :భారత స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఆయా కళాశాలలు, పాఠశాలలో జిల్లాస్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజేష్, ప్రోగ్రాం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పీఎస్ఎం గర్ల్స్ హైస్కూల్లో బ్రోచర్ ఆవిష్కరించారు. వచ్చేనెల 3 నుంచి 9వ తేదీన వరకు జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. వివరాలను 81439 14303, 99123 22269 నంబర్లకు వాట్సప్ ద్వారా తెలియ జేయాలని కోరారు. దేశ నాయకుల చరిత్ర, పర్యావరణ పరిరక్షణ, అధిక జనాభా అరిష్టాలు, క్రీడా రంగం-కళా రంగం తదితర అంశాలపై పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేనెల 17న క్విట్ ఇండియా దినోత్సవం పురస్కరించుకుని ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తామని తెలిపారు. నరహరిశెట్టి కృష్ణ, హైస్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీదేవి, సునీత, నందమూరి రాజేష్, అరసవల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డీఎల్ఎడ్ పరీక్షలకు ఫీజు చెల్లించండి

ఏలూరు అర్బన్, జూలై 30 : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఎడ్) పరీక్షలకు అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 11లోగా, ఫైన్ రూ.50తో కలిపి ఆగస్టు 19లోగా చెల్లించాలని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో కోరారు. పరీక్షలు సెప్టెంబరులో జరుగుతాయన్నారు.



పాడి రైతులకు మంచి రోజులు



పథకాలను పక్కన పడేసిన వైసీపీ ప్రభుత్వం
పునఃప్రారంభిస్తున్న కూటమి ప్రభుత్వం
రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

ఏలూరు టూటౌన్/ భీమవరం రూరల్ జూలై 30: రాష్ట్రంలో వ్యవసాయ రంగం తరువాత అంతటి ప్రాధాన్యం గల రంగం పాడి పరిశ్రమ. పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు,పాల దిగుబడులు పెంచేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది.వైసీపీ ప్రభుత్వం పథకాలన్నింటిని రద్దు చేసి పాడి రైతుల నోట్లో మట్టికొట్టింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కొక్క పథకాన్ని పునఃప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే మినీ గోకులం పథకాన్ని ప్రారంభించింది. అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వా నించింది. పశువులకు అవసరమైన గడ్డిని పెంచుకునేందుకు ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు పథకాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల ప్రకటించారు. దీంతో పాడి రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

మినీగోకులం పథకం ప్రారంభం

2014-19 సంవత్సరాల మధ్య టీడీపీ ప్రభుత్వం మినీగోకులం పథకాన్ని ప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం రాగానే ఈ పథకాన్ని రద్దు చేసింది. అంతేకాక షెడ్లు నిర్మించుకున్న రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రాయితీలు చెల్లించలేదు. ప్రభుత్వ రాయితీలు మాకు వద్దు బాబు మేము కట్టిన సొమ్ము అయినా మాకు ఇవ్వండి అని అన్నా కానీ ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. మినీగోకులం పథకంలో రెండు పశువులకు షెడ్లు నిర్మించుకోవడానికి లక్షా 15 వేలు టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో 90 శాతం రాయితీతో 1,03,500 ఇచ్చింది. లబ్ధిదారుల వాటా 10 శాతం 11,500 చెల్లించాలి. అలాగే నాలుగు పశువులకు లక్షా 85 వేలు అయితే రాయితీ 1,66,500, రైతు వాటా 18,500, ఆరు పశువుల షెడ్డుకు యూనిట్ విలువ 2 లక్షల 30 వేలు. దీనిలో ప్రభుత్వ రాయితీ 2 లక్షల 7500, రైతు చెల్లించాల్సినది 23వేలు.గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్డు నిర్మించు కునేందుకు 70 శాతం ప్రభుత్వం రాయితీ కల్పించింది. 30 శాతం రైతులు భరించాలి. 20 గొర్రెలు, 20 మేకలకు షెడ్డు నిర్మించుకోవడానికి యూనిట్ విలువ రూ.లక్షా 30 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో 91 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. రైతులు 39 వేలు చెల్లించాల్సి ఉంటుంది. 50 గొర్రెలు, 50 మేకలకు షెడ్డు నిర్మాణానికి రూ.2 లక్షల 30 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో ప్రభుత్వం రూ.లక్షా 61 వేలు రాయితీ ఇస్తుంది. రూ.69 వేలు రైతు కట్టాల్సి ఉంటుంది. 100 కోళ్ళ పెంపకానికి రూ.లక్షా 32 వేలు షెడ్ల నిర్మాణానికి అయితే ఇందులో 92 వేలు రాయితీ ప్రభుత్వం ఇస్తుంది. రైతులు 39 వేలు భరించాల్సి ఉంది. జిల్లాలో 756 మినీగోకులం షెడ్లు

ఏలూరు జిల్లాలో 1,35,607 ఆవులు, 5,06,110 గేదెలు, 5,26,836 గొర్రెలు, 1,98,810 మేకలు, 7618 పందులు, పౌల్ట్రీ కోళ్లు 11,86,075 ఉండగా పశ్చిమ గోదావరి జిల్లాలో 45,539 ఆవులు, 1,78,137 గేదెలు, 38,804 గొర్రెలు, 22,765 మేకలు, 43,04,397 కోళ్ళు ఉన్నాయి..

రైతులు నిర్మించుకున్నారు. వీటిలో 384 షెడ్లుకు ప్రభుత్వం డబ్బులు చెల్లించింది. మిగిలిన 402 షెడ్లు అసంపూర్తిగా మిగిలిపోయాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 1338 షెడ్లకు గాను 742 పూర్తి చేశారు. మిగిలినవి అసంపూర్తిగా ఉన్నాయి

పశు బీమా పథకం

ప్రమాదవశాత్తు పాడిపశువు చనిపోతే అప్పటి టీడీపీ ప్రభుత్వం పశు నష్టపరిహారం కింద రూ.30 వేలు రైతుకు అందించేది. అలా ఒక రైతుకు ఎన్ని గేదెలు చనిపోయినప్పటికి అన్ని గేదెలకు నష్టపరిహారం చెల్లించింది. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బీమా పేరుతో 30 శాతం రైతులతో కట్టించింది. అది కూడా సరిగా అమలు చేయలేదు. చాలా మంది రైతులు పాడి పశువులను కోల్పోయి అటు నష్టపరిహారం అందక చాలా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక కుటుంబంలో ఆరు గేదెలు వరకు మరణిస్తే నష్టపరిహారం చెల్లించేది. టీడీపీ ప్రభుత్వం ఎన్ని పశువులు చనిపోతే అన్ని పశువులకు నష్టపరిహారం అందించేది.

వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పథకాలు

హర్యానా, పంజాబ్ రాష్ట్రాల నుంచి పాడి గేదెలు, పాడి ఆవులను కొనుగోలు చేసి 75 శాతం రాయితీతో అర్హులైన రైతులకు అందించేది. పేయి దూడలకు దానా సరఫరా, బీమా కోసం సునందిని పథకాన్ని 75 శాతం సబ్సిడీతో ఉన్న పథకాన్ని వైసీపీ రద్దు చేసింది. చూడి పశువుకు ఈనక ముందు మూడు నెలలు, ఈనిన తరువాత 3 నెలల వరకు 75 శాతం సబ్సిడీతో దాణా సరఫరా, బీమా సౌకర్యంతో ఉన్న క్షీరసాగర పథకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. పాల ఉత్పత్తిని పెంచేందుకు పాకుడు గడ్డి సరఫరా, సమీకృత దాణా కోసం 90 శాతం సబ్సిడతో సైలేజీ పథకాన్ని రద్దు చేసింది. ఈ పథకాలన్నింటిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని రైతులు కోరుకుంటున్నారు.

సిబ్బంది ఇలా..

ఏలూరు జిల్లా : జాయింట్ డైరెక్టర్ 1, డిప్యూటీ డైరెక్టర్లు ఇద్దరు, అసిస్టెంట్ డైరెక్టర్లు 12 మంది, వెటర్నరీ డాక్టర్లు 70 మందికి 52 మంది ఉన్నారు. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లు 11, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు 19, లైవ్ స్టాక్ అసిస్టెంట్ 45, వెటర్నరీ అసిస్టెంట్‌లు 52 మందికి 35 మంది ఉన్నారు. ఆఫీస్ సబార్డినేట్స్ 29 మంది, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ 312 మంది, గోపాలమిత్రలు 138 మంది ఉన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా : జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి 1, డిప్యూటీ డైరెక్టర్లు - 4, అసిస్టెంట్ డైరెక్టర్లు- 14, వెటర్నరీ డాక్టర్లు 52 మందికి 34 మంది పనిచేస్తున్నారు. 18 ఖాళీగా ఉన్నాయి. వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లు 7 మంది, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు 18 మందికి 17 మంది, లైవ్ స్టాక్ ఆఫీసర్లు - 15 , వెటర్నరీ అసిస్టెంట్లు 46 మందికి 9 మంది, పశు సంవర్ధక సహాయకులు 182 మంది, గోపాలమిత్రలు 49 మంది పనిచేస్తున్నారు.

హాస్టల్..అధ్వానం

శిథిలావస్థలో బాలికల వసతి గృహం
తలుపులు లేని మరుగుదొడ్లు
మౌలిక వసతులు లేక విద్యార్థినుల అవస్థలు




గణపవరంలోని బాలికల హాస్టల్ బాత్‌రూమ్‌లకు తలుపులు ఊడిపోయిన దృశ్యం

గణపవరం, జూలై 30: ప్రభుత్వ వసతి గృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గణపవరంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహంలో 12 గదులున్నాయి. 8 గదుల్లో వర్షం చేరడంతో నాలుగు గదులు మాత్రమే వినియోగిస్తున్నారు. విద్యార్థులకు మంచాలు లేక నేలపైనే నిద్రిస్తున్నారు. ఏడు మరుగుదొడ్లు,9 బాత్‌రూమ్‌లు ఉన్నప్పటికి ఉపయోగం లేకుండా తయారయ్యాయి. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో సమీపంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో ఉన్నవాటిని వాడుకుంటున్నారు. బాత్‌రూమ్‌లు కూడా నిరుపయోగంగా తయారయ్యాయి. ఒకప్పుడు వందల సంఖ్యలో విద్యార్థుల ఉన్న హాస్టల్ నేడు కళాహీనంగా తయారైంది. ప్రస్తుతం 35 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పైగా గేట్లు కూడా ధ్వంసమయ్యాయి. బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోందని విద్యార్థులు అటున్నారు. కాస్మోటిక్స్ బిల్లులు కూడా ఆరు నెలల నుంచి ప్రభుత్వం చెల్లించడం లేదు.

ప్రతిపాదనలు పంపుతున్నాం

సూరమ్మ, వసతి గృహం వార్డెన్

వసతి గృహం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవం. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మరుగుదొడ్లను వినియోగించుకుంటున్నారు. తాగునీరు కూడా బయట నుంచే తెచ్చినీరే ఇస్తున్నాం. మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నాం. స్పెషల్ ఆఫీసర్లు వచ్చి వెళ్లారు. అయితే నేటివరకు ఎటువంటి నిధులు మంజూరు కాలేదు.


పరిస్థితి వివరిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

రైతులకు పరిహారం అందిస్తాం

వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 30: ఎర్రకాలువ వరద ప్రభావంతో వరి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందని వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో ఎర్రకాలువ ముంపు ప్రభావంతో కుళ్లిపోయిన వరి పొలాలను పరిశీలించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరడంతో మంగళవారం ఆయన మండలంలోని నందమూరు, ఆరుళ్ల, జగన్నాధపురం, మాధవరం గ్రామాల్లో పంట నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించారు. ఎర్రకాలువ వంతెన, కాలువ గట్లు గురించి ఎమ్మెల్యే వివరించారు. రాజశేఖర్ మాట్లాడుతూ పంట నష్టంపై అంచనాకు వచ్చి చర్చించి త్వరితగతిన పరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. వాటితో పాటు ఎర్రకాలువ ముంపు నుంచి రైతులకు ఇబ్బంది లేకుండా గట్లు పటిష్టం చేయడంతో నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కూడా స్వల్పకాలిక వరి రకాలు వేయడం ద్వారా నష్ట నివారణ చేపట్టవచ్చన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేస్తున్నామని అందరికీ పరిహారం అందించే చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులంతా ఈ పంట నష్ట నివేదికలు త్వరితగతిన సమర్పించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎర్రకాలువ ముంపు ప్రాంత రైతులను ఆదుకు నేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. జిల్లా అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలను ఆదర్శంగా నిలపాలి :కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆంధ్రజ్యోతి), జూలై 30 : జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాలను దేశానికే ఆదర్శంగా నిలపాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నాబార్డు ఆధ్వర్యంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీవో) ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా అధికా రాబడి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కోకో పంట ఎక్కువగా ఉంటుందని, వాటితో రైతుల ద్వారా ఊటీ, కొడైకెనాల్ వంటి ప్రాంతాల్లో మహిళలు ఇంట్లోనే ఎక్కువగా తయారుచేసే, ప్రాచుర్యం కలిగిన హోమ్‌మేడ్ చాక్లెట్‌లను తయారు చేసేందుకు ఏలూరు జిల్లాలో కూడా ప్రోత్సహించాలి. నూజివీడు మామిడి రసాలు దేశవ్యాప్తంగా బ్రాండ్ కలిగి ఉన్నాయని వాటికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. సంఘంలో కనీసం 300 మంది సభ్యులు ఉండాలని, జిల్లాలో ప్రస్తుతం 17 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయని సంఘాలకు రాయితీతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతో పాటు రాయితీపై యంత్రాలు కూడా అందిస్తామన్నారు. రైతుల్లో అవగాహన కల్పించి పెద్దఎత్తున రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నాబార్డ్ డీడీఎం అనిల్‌కాంత్, వ్యవసాయశాఖ జేడీ ఎస్కే హబీబ్ భాషా, డీవోఎస్ అబ్రహం, అసిస్టెంట్ ఎల్డీఎం చంద్రశేఖర్, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్సకే పరిమితం

నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తే చర్యలు : డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, జూలై 30 : నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీలు, పీఎంపీలు వైద్యం చేస్తే వారిపై చట్టపరమైన కఠినచర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట హెచ్చరించారు. మంగళవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, వారు నిర్వహించే క్లినిక్‌లకు వచ్చే వారిని సమీపంలోని ప్రభుత్వ పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. దీనికి విరుద్ధంగా వైద్యం చేయడం, మందులు, ఇంజక్షన్ల ద్వారా చికిత్స అందించి వ్యాధి తీవ్రం అయిన తర్వాత ప్రభు త్వాసుపత్రులకు పంపించడం వల్ల అప్పటికే వారు నీరసించి కోలుకోలేని స్థితికి వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆర్థికంగా, శారీరకంగా అన్ని విధాలా నష్టపోతున్నారని వివరించారు.ఎవరైనా పీఎంపీలు, ఆర్ఎంపీలు నిబంధ నలను అతిక్రమించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

మరో ఇద్దరు ఆర్ఎంపీలకు షోకాజ్ నోటీసులు

నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేస్తున్న పెదవేగి మండలం కూచింపూడి, పెదవేగి గ్రామాలకు చెందిన ఇద్దరు ఆర్ఎంపీలకు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. స్థాని కుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు వివరించాయి. జ్వరంతో వచ్చిన వారికి ఆర్ఎంపీలు ఇష్టానుసారం వైద్యం చేస్తున్నట్టుగా ఫిర్యాదులొచ్చాయని పేర్కొన్నాయి. జిల్లాలో ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లు నిర్వహిస్తోన్న ఆర్ఎంపీలు, పీఎంపీలు ఎంతమంది వున్నదీ సర్వేచేసి జాబితాను పంపాల్సిందిగా స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులను డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు ఆదేశించారు. నిర్ణీత ప్రొఫార్మాలో సంబంధిత ఆర్ఎంపీ / పీఎంపీ ఫోటో, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరు, వారి విద్యార్హతలు, అందిస్తోన్న వైద్యసేవలు తదితర సమాచారాన్ని కోరినట్టు అధికార వర్గాలు వివరించాయి. జిల్లాలో అధికారికంగా 800 మంది పైచిలుకు ఆర్ఎంపీలు/పీఎంపీలు ఉన్నట్టుగా ప్రాథమికంగా సమాచారం అందిందని, మరికొందరు అనధికారికంగా సెంటర్లు నిర్వహిస్తున్నట్టుగా తెలుస్తోందని పేర్కొన్నాయి. జిల్లాలో సుమారు 200 మందికి నోటీసులు జారీచేసిన నేపథ్యంలో వీరందరిపైనా ఒక్కసారిగా చర్యలు తీసుకుంటే క్షేత్రస్థాయిలో స్థానికులు ఇబ్బందులు పడతారని బావిస్తోన్న వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తోంది. ముందుగా ఆర్ఎంపీలు, పీఎంపీలతో ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించి వారందించాల్సిన ప్రాథమిక వైద్యం, పాటించాల్సిన నియమాలపై సూచనలు చేసిన తర్వాత కూడా ఉల్లంఘనలకు పాల్పడేవారిపై చర్యలు తీసు కోవడం సబబుగా ఉంటుందని ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. దీనిపై అధికారికంగా డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు స్పందించడానికి నిరాకరించాయి.


కొయ్యలగూడెంలో ఆందోళన చేస్తున్న మొక్కజొన్న రైతులు

మొక్కజొన్న రైతుల ఆందోళన

కొయ్యలగూడెం, జూలై 30:కొనుగోలు చేసిన మొక్కజొన్న పంటకు దళారి డబ్బులు ఇవ్వడం లేదంటూ రైతులు కొయ్యలగూడెంలో ఒక గోడౌన్ దగ్గర ఆందోళన నిర్వహించారు. పోలవరం మండలం గూటాల గ్రామానికి చెందిన మొక్కజొన్న రైతులు ఒక దళారికి మొక్కజొన్న పంట అమ్మారు. అయితే ఆ దళారి డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఆ మొక్కజొన్న పంటను మరో దళారికి అమ్మేశాడు. అయితే ఆ పంటను కొయ్యలగూడెం గోడౌన్‌లో ఉంచారని తెలుసుకున్న రైతులు గోడౌన్ వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. వేరే దళారి దగ్గర మేము కొనుగోలు చేశామని అతనికి డబ్బులు చెల్లించేశామని వారు చెబుతున్నారు. దీంతో రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్ మద్దతు తెలిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కారుపై దాడి అవాస్తవం

డీఎస్పీ సురేష్ కుమార్ రెడ్డి


విలేకరులకు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ

జీలుగుమిల్లి, జూలై 30 : పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కారుపై సోమవారం జరిగిన దాడి విషయమై పోలీసు నిఘా వర్గాలు ఆరా తీశాయి. పోలవరం డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ క్రాంతికుమార్ పలువురు ఎస్సైలు విచారణ జరిపారు. ఎమ్మెల్యే కారుపై దాడి జరిగిందనే వార్తలు, కథనాల్లో వాస్తవం లేదని డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద కారు షెడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ఒక స్తంభం వచ్చి కారు అద్దం మీద పడడంతో కొంత డ్యామేజ్ అయ్యింది. సోమవారం ఎమ్మెల్యే మరో కారులో పర్యటించారు. సాయంత్రం ఎమ్మెల్యే పీఏ, మరో ఇద్దరు ఎమ్మెల్యే అనుచరులు ఇంటి వద్ద ఉన్న కారులో బయటకు వెళ్తుండగా బర్రింకలపాడు వద్దకు వచ్చేసరికి రోడ్డు టర్నింగ్ వద్ద కుదుపునకు కారు వెనుక అద్దాలు ఒక్కసారిగా ముక్కలయ్యాయి. దీంతో కారులో ఉన్నవారు ఎవరో తమపై దాడి చేశారని భావించారని తెలిపారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమకు శత్రువులెవరూ లేరని నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలే ఉన్నాయని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు. ఈ ఘటనపై విచారణకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్, ఎస్‌బీ, ఇంటిలిజెన్స్ బృందాలు, ఎస్సైలు చంద్రశేఖర్, వెంకన్న, విష్ణువర్ధన్, దుర్గామహేశ్వరరావు, సాధిక్ పాల్గొన్నారు.

నరసాపురం వ్యాపారిపై నెల్లూరులో ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూలై 30: కుదవపెట్టిన బంగారు ఆభరణాలు నకిలీవంటూ వ్యాపారి తమను మోసం చేశాడంటూ మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లూరులోని వేదాయపాళెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన ఉషారాణి తన ఇద్దరు పిల్లలు, తల్లి భవానీతో కలిసి నెల్లూరు నగరంలోని పడారుపల్లిలో నివాసం ఉంటున్నారు. తన తాలూకు 141.54 సవర్ల బంగారు ఆభరణాలను తమకు బాగా తెలిసిన నర్సాపురంలోని ఓ బంగారు వ్యాపారికి చెందిన దుకాణంలో తాకట్టు పెట్టి రూ.47.40 లక్షలు తీసుకున్నారు. ప్రతి నెల వడ్డీ చెల్లిస్తున్నారు. ఇటీవల ఉషారాణి, భవానీ నర్సాపురం వెళ్లి తమకు నగదు అవసరమని తాకట్టులోని బంగారు ఆభరణాలను విక్రయించి మిగిలినది నగదు ఇవ్వాలని వ్యాపారిని కోరారు. తాకట్టులో ఉన్న ఆభరణాలు నకిలీవని, మీరే నగదు చెల్లించాలని వ్యాపారి చెప్పడంతో బాధితురాలు రెండు రోజుల కిందట వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఈ సంఘటన జరిగిన ప్రదేశం నరసాపురం కావడంతో తదుపరి విచారణ నిమిత్తం కేసును అక్కడి స్టేషన్‌కు బదిలీ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అక్రమంగా కేసు నమోదు చేశారు..


నెల్లూరులో మాట్లాడుతున్న జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి

ఉషారాణిపై నర్సాపురం టౌను పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేశారని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర కార్యదర్శి కనుపూరు శ్రీని వాసులు ఆరోపించారు. మంగళవారం నెల్లూరు ప్రెస్ క్లబ్‌లో ఆయన బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాము కుదువ పెట్టిన బంగారాన్ని విక్రయించి అప్పు మొత్తం పోగా మిగిలిన నగదు ఇవ్వాలని ఉషారాణి, ఆమె తల్లి భవానీ వ్యాపారిని కోరారని అయితే ఆ వడ్డీ వ్యాపారి తన వద్ద గిల్టు నగలు కుదువ పెట్టి మోసం చేశారంటూ తల్లీ కూతుళ్లను బూతులు తిట్టి చంపేస్తామని బెదిరించాడని ఆరోపించారు. దీంతో వారు ప్రాణభయంతో నెల్లూరుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. నరసాపురం పోలీసులు వ్యాపారి దుకాణంలో సీసీ కెమెరాలు పరిశీలించకుండా, స్టాకు రికార్డులు పరిశీలించ కుండా ఏకపక్షంగా కేసు నమోదు చేశారని విమర్శించారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం, మానవ హక్కులసంఘం జాతీయ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళుతున్నామని తెలిపారు.

క్రైం కార్నర్

పంట బోదెలో పడి ఒకరి మృతి

భీమవరం క్రైం, జూలై 30 : తన ఇంటి సమీపంలోని పంట బోదెలో ఒక వ్యక్తి పడి మృతి చెందినట్టు టూటౌన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు 39వ వార్డు దుర్గాపురానికి చెందిన కూతాడ శ్రీనుకు (40) పిట్స్ వ్యాధి ఉంది. ఈనెల 29వ తేదీన పక్కనే ఉన్న తన తల్లి ఇంటికి టీవీ చూడడానికి అని వెళ్ళాడు. సాయంత్రం అయినా కూడా ఇంటికి రాకపోవడంతో భార్య, బంధువులు అన్ని చోట్ల వెతికారు. ఇంటి సమీపంలోని పంట బోదెలో శ్రీను మృతదేహం మంగళవారం కనిపించింది. దీనిపై మృతుని భార్య గంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

పాలకోడేరు, జూలై 30: బైక్ ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతూ పాలకోడేరు గ్రామానికి చెందిన గుంటబోయిన అప్పలనాయుడు (58) సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్టు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాస రావు మంగళవారం తెలిపారు. పాలకోడేరు గ్రామానికి చెందిన రైతు కూలి అయిన అప్పలనాయుడు మోగల్లు నుంచి పాలకోడేరు వస్తుండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం శవ పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి దుర్మరణం

జంగారెడ్డిగూడెం, జూలై 30: కరెంట్ షాక్‌తో పట్టణంలో ఓ ఇంటిపైన ఆడుకుంటున్న బాలుడు వెదుళ్ళ నరేష్ (12) మంగళవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక రామచంద్రాపురంలో వెదుళ్ళ నాగేశ్వరరావు, శ్యామల దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు మగ పిల్లలు. పెద్ద కుమారుడు ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతుండగా చిన్న కుమారుడు నరేష్ ఆరో తరగతి చదువుతున్నాడు. శ్యామల ఓ ఇంటి వద్ద పని చేస్తున్నది. రోజూ ఇంటి నుంచి పనికి వెళ్ళాలంటే ఆలస్యం, దూరం అవుతోందని ఆమె పనిచేసే యజమాని ఇంటికి దగ్గరగా ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మంగళవారం రాత్రి శ్యామల పనిచేసే యజమాని ఇంటి వద్ద పుట్టినరోజు వేడుక జరుగుతుండగా శ్యామల కుమారుడు నరేష్ కూడా తల్లితో వెళ్ళాడు. తల్లి పనిలో ఉండగా నరేష్ భవనం పైన ఆడు కుంటుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే బాలుడిని దగ్గరగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అధికారులు తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు.

స్కూటీ మాయం..ఫిర్యాదు

భీమవరం క్రైం, జూలై 30 : భీమవరం పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో భీమవరం ఆసుపత్రి వద్ద తన స్కూటర్ పోయిందని బాధితుడు ఫిర్యాదు చేసినట్టు టూటౌన్ ఎస్ఐ రమేష్ తెలిపారు. భీమవరం మండలం చిన అమిరం గ్రామానికి చెందిన కలిశెట్టి తాతారావు స్కూటీ గత నెల 15వ తేదీన మాయమైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.


పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న సంస్థ సభ్యులు

గోవులను రక్షించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 30: గోవులను వధించి కలేబరాలను బయటకు తరలిస్తున్న వ్యక్తులను అడ్డుకుని వారిని ధర్మ సంస్థాపన సంస్థ సభ్యులు మంగళవారం పోలీసులకు అప్పగించారు. గోవధ నిషేధం అయినా కొందరు ఇష్టారీతిన గోవులను వధించి కబేళాలకు తరలించడం దారుణమని ధర్మసంస్థాపన సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోవులను రక్షించాలంటూ నినాదాలు చేశారు.

జనన,మరణ నమోదుకు ఇబ్బందులు

రెండు నెలలుగా యాప్ పనిచేయడం లేదంటున్న సిబ్బంది

పాలకొల్లు, జూలై 30 :మున్సిపల్ కార్యాలయంలో ఉన్న జనన మరణ రిజిస్ట్రేషన్ కార్యాలయం రెండు నెలలుగా పనిచేయకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జనన,మరణ నమోదు యాప్ పనిచేయకపోవడమే ఇందుకు కారణం అని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. రాష్ట్రం అంతా ఇదే పరిస్థితి నెలకొందని సిబ్బంది చెబుతున్నారు. అయితే యాప్ పనిచేయకుంటే వేరే విధంగా సర్టిఫికెట్లు జారీ చేయాలి. లేకుంటే విద్యార్థులు, ఇటీవల మరణించిన వారి వారసులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోం దని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు రెండు నెలలుగా సర్టిఫికెట్లు రాకపోవడంతో తమ భవిష్యత్ ప్రశ్నార్థకం అని వాపోతున్నారు. సంబంధిత అధికారులు త్వరిత గతిన యాప్‌ను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూలై 30 : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియట్‌లలో 2024-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం లేకుండా నిర్ణీత ఫీజు చెల్లించి ఈనెల 31 నుంచి ఆగస్టు 27వరకు, అపరాధ రుసుం రూ.200 కలిపి 28 నుంచి సెప్టెంబరు 4 వరకు అడ్మిషన్లకు గడువు ఉందని వివరించారు. ఏపీ ఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్ లేదా ఏపీ ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు.




పడమరవిప్పర్రులో సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంటున్న పసల కనకసుందరరావు.. అంబోతుతిప్పలో స్వామివారికి అభిషేకం




అత్తిలిలో కావడి ఉత్సవంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి.. కావడి ఉత్సవ ఊరేగింపు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి కావడి ఉత్సవం

పెంటపాడు, జూలై 30: ఆషాఢ మాసం ఆఖరి మంగళవారం సందర్భంగా పడమరవిప్పర్రులోని సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పసల కనక సుందరరావు పుట్టినరోజు సందర్భంగా నాయకులు ఆయనను సత్కరించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. మాజీ సర్పంచ్ పసల చంటి, సొసైటీ మాజీ చైర్మన్ పసల అచ్యుతం, జనసేన రాష్ట్ర నాయకుడు గంటా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అత్తిలి: అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆడి కృత్తికా కావడి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి దీక్ష చేపట్టిన భక్తులు పాల కావడిలు భుజాన వేసుకుని గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కోలాట భజనలు, కేరళ వాయిద్యాలతో ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. స్వామి వారికి ఇరుముడులు సమర్పించారు. ఆలయ అర్చకు లు ఐలూరి రామం, కృష్ణమూర్తి అభిషేకాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి పాల కావడిని భుజాన ఎత్తుకుని స్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆల య కమిటీ అధ్యక్షుడు కురెళ్ళ ఉమామహేశ్వరరావు ఆయనను సత్కరించారు.

మొగల్తూరు: రామన్నపాలెం అంబోతుతిప్పలో శ్రీవల్లిదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలకావిడి ఉత్సవం జరిపారు. కెపిపాలెం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సుమారు 40 మంది మాలదారులు 40 కావిడిలతో అంబోతుతిప్పలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వరకూ ఊరేగింపుగా తరలివచ్చారు. సుమారు 80 బిందెల పాలు, అభిషేక ద్రవ్యాలు, సుగంధ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు రవితేజ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

పెంట్లమ్మకు ఆషాఢ సారె



శాకంబరిగా పెంట్లమ్మవారు

పెంటపాడు, జూలై 30: కే.పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మకు గ్రామస్థులు ఆషాఢ సారె అందజేశారు. తొలుత గ్రామంలో బైరాగి మఠం గోపాలస్వామి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు అనంతరం మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వెళ్లి అమ్మవారిని శాకంబ రిగా అలంకరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అమ్మవారిని దర్శించుకున్నారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్, ఆలయ కమిటీ చైర్మన్ పంతం శేఖర్, సర్పంచ్ పీతల సత్యనారా యణ, నరాలశెట్టి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

భీమవరం క్రైం, జూలై 30 : మహిళలు, పిల్లలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్త వహించాలని, తెలియని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు తీసుకోవద్దని, స్పృహ తప్పితే అక్రమ రవాణాకు పాల్పడతారని భీమవరం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అడపాల ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా భీమవరం బలుసుమూడి సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయవాదులు పి.అబేద్కర్, డి రవికిరణ్, కె జ్యోతి, పారాలీగల్ వలంటీర్లు శ్రీలక్ష్మి, కాళేశ్వరి, ఇన్‌చార్జి అడ్మిన్ డి బోసు పాల్గొన్నారు.

ఆరోగ్యం, ఆహారంపై అవగాహన

నరసాపురం టౌన్, జూలై 30: ప్రభుత్వం అంగన్‌వాడీలకు అందించే పథకాలను ప్రతి ఒక్కరికి తెలియజేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సుజాత రాణి అన్నారు. మంగళవారం మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 12వవార్డు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె అతిథిగా విచ్చేశారు. లింగ వివక్షత లేకుండా సమానత్వం, రక్తహీనత, బాల్య వివాహాలు, స్థిరమైన ఆలోచన విధానం, ఆరోగ్యం, పౌష్టికహారం, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అంగన్‌వాడీలు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సీడీపీవో ఊర్మిళ, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆకివీడు: ఆడపిల్లలు ఆపద సమయంలో తమను తాము రక్షించుకొనేలా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి అన్నారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ శక్తి వంద రోజుల్లో భాగంగా అంగన్‌వాడీలతో కలిసి ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. మనోధైర్యంతో ఆడపిల్లలు ఉండాలన్నారు. తల్లీ పిల్లల ఆరోగ్యంగా ఉండడం ముఖ్యమన్నారు.

సమాచారం

రేపు తణుకులో జాబ్ మేళా

ఇరగవరం, జూలై 30 : తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్‌లో ఆగస్టు 1న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యూజన్ మైక్రో ఫైనాన్స్, ఇవన్ ఇంటర్ ప్రైజెస్ సంస్థలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయన్నారు. 2021-2024 సంవత్సరాల్లో డిగ్రీ పాసైన అభ్యర్థులు అర్హులని ఏడాదికి రూ. లక్ష నుంచి 2.40 లక్షలు వరకూ జీత భత్యాలు ఇస్తారని, మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్లు 98662 15054, 93818 38672లలో సంప్రదించాలన్నారు

15న అన్న క్యాంటీన్ ప్రారంభం



దాత చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 30: ఆగస్టు 15న పండుగ వాతావరణంలో పట్ట ణంలో అన్న క్యాంటీన్ ప్రారంభమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి తెలిపారు. మంగళవారం పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలో గల అన్న క్యాంటీన్ వద్ద పెంటపాడు మండల క్లస్టర్ ఇన్‌చార్జి కుడుళ్ళ చంద్రశేఖర్ సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం దాత కుడుళ్ళ చంద్రశేఖర్‌ను సత్కరించారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, బండి పెద్దిరాజు, నరిసే సోమేశ్వరరావు, దాసరి కృష్ణవేణి, వాడపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల(ఉండి) జూలై 30: కాళ్ల మండలం జక్కరం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పీర్ అహ్మద్‌కాన్ తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మలు తొలగింపు నిమిత్తం బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జక్కరం, బొండాడపేటలతో పాటు ఉండి మండలం వాంద్రం, చినపుల్లేరు గ్రామాలలో విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం టౌన్, జూలై 30: స్థానిక కోర్టు ప్రాంగణంలో బుధవారం నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసఫ్ తెలిపారు. ఇప్పటి వరకు నూతన కార్యవర్గంలో పది స్థానాలు ఏకగ్రీవమయ్యాయన్నారు. మిగిలిన స్థానాలైన అధ్యక్ష పదవికి చేగొండి రంగ రామ్మోహన్, బాలాజీ, వల్లభరావు, ప్రధాన కార్యదర్శి పదవికి స్టన్‌కుమార్, పుల్లాజీ, గ్రంథాలయ కార్యదర్శికి అమరేశ్వరరావు, శ్రీనివాసరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శికి శ్రీమంత్, చిట్టి పద్మజ, మహిళా ప్రతినిధికి ప్రగతి, జెస్సీకళలు పోటీలో ఉన్నారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30గంటల జరిగే పోలింగ్‌లో 177 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారని, అదే రోజు ఫలితాలు ప్రకటిస్తామని జోసఫ్ చెప్పారు.



బాడవలో వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల..



విజయవాడలో మంత్రి సత్యప్రసాద్‌ను కలసిన పాలకోడేరు బీసీ నాయకులు..



పండితవిల్లూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని..



భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబుకు కళాకారుల సత్కారం

కృష్ణమ్మ ఆశీర్వాదంతో జలకళ: మంత్రి నిమ్మల

యలమంచిలి, జూలై 30: రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించినట్లుగానే.. కృష్ణమ్మతల్లి కూడా ఆశీర్వదించడంతో శ్రీశైలంతోసహా అన్ని ప్రాజెక్టులు నిండుతూ జలకళ నెలకొందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం యలమంచిలి మండలం బాడవ గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టడంతో మంత్రి నిమ్మల రామానాయుడు 6 కిలోమీటర్లు ట్రాక్టర్‌పై ప్రయాణించి బాడవ గ్రామం చేరుకున్నారు. మంత్రి రామానాయుడు గ్రామంలో వరదనీటిలో పర్యటించి వరదబాధితులను పరామర్శించి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. నీటమునిగిన వరిచేలను పరిశీలించారు. వరదబాధిత కుటుంబాలకు ప్రభుత్వసాయంగా 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు అందజేశారు. శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా పోతిరెడ్డిపాడు నుంచి ప్రతిరోజూ అవసరమైన నీటిని రాయలసీమకు అందిస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా ద్వారా నీరు విడుదలచేయమని ఆదేశించినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, తహసీల్దారు సిహెచ్.విజయశ్రీ, సర్పంచ్ రాయి విజయ వెంకటదుర్గ, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీసీలు ఐకమత్యంగా ఉండాలి

పాలకోడేరు, జూలై 30: రాష్ట్రంలో బీసీలంతా ఐకమత్యంగా ఉంటూ రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి సేవా భావం కలిగి ఉండాలని రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ అన్నారు. అమరావతిలోని మినిస్టర్ కార్యాలయం వద్ద బీసీ నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. రెవిన్యూ మంత్రిని కలిసిన వారిలో పాలకోడేరు మండల బీసీ నాయకులు కామన రాంబాబు, కామన సుబ్బారావు, రాష్ట్ర బీసీ నాయకుడు వీరంకి రంగారావు, వాకా రామ్‌గోపాల్, అశోక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రాయితీ పథకాలపై అవగాహన కల్పించాలి

పోడూరు, జూలై 30: పశు పోషణతోనే పాల దిగుబడులు సాధ్యమని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం పండితవిల్లూరులో ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ పశువుల్లో వచ్చే వ్యాధులను పశువైద్యులు ఎప్పటికప్పుడు గుర్తించి పశుసంరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పశుపోషణకు అందించే అన్ని రకాల రాయితీ పథకాలను రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ ఇళ్ల లక్ష్మీచంద్రిక, జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, మాజీజడ్పీటీసీ బొక్కా నాగేశ్వరరావు జిల్లా టీడీపీ కార్యదర్శి గణపతినీడి రాంబాబు, గ్రామటీడీపీ అధ్యక్షుడు నామాల శ్రీనివాసరావు, రైతు కమిటీ అధ్యక్షుడు సదమళ్ల బుల్లిరాజు, ఉపాధ్యక్షుడు పిల్లి రామకృష్ణ, నామాల ఫణీంద్ర, నెక్కంటి శివ, పశుసంవర్ధక శాఖ ఉమ్మడి జిల్లా అధికారి జేసురత్నం, ఏడీఏ జీకె.జాన్సన్, పశువైద్యులు మాధురి, మహేష్‌కుమార్, రవికాంత్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకుంటాం

భీమవరం టౌన్, జూలై 30: కళాకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక బైపాస్ రోడ్డులో జరిగిన ది భీమవరం ఆర్కెస్ట్రా కళాకారుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని మాట్లాడారు. కళాకారులకు ఏ సమస్య వచ్చినా తమ వద్దకు వస్తే ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంజిబాబును సత్కరించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు) పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ది భీమవరం ఆర్కెస్ట్రా కళాకారుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చెబోలు రామ్మోహన్ రావు, గౌరవ సలహా సభ్యులు దిగమర్తి సత్యనారాయణ, అధ్యక్షుడిగా గాతల చక్రవర్తి, కార్యదర్శి పోతుల ఆనంద్ కుమార్‌లను ఎన్నుకున్నారు.

వరద బాధితులకు సరుకులు



గుత్తులవారిపాలెంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

పాలకోడేరు, జూలై 30: వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ముంపునకు గురైన ప్రజలు, రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. మోగల్లు శివారు గుత్తులవారిపాలెంలో ఇటీవల కురిసిన వర్షాలకు గోస్తనినదికి గండిపడి ఇబ్బందిపడ్డ వరదబాధితులను, రైతులను ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించి ప్రభుత్వసహాయం కింద 25కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.3వేలు నగదు ఇంటింటికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుత్తులవారిపాలెంలో ప్రతి ఏడాది గోస్తని నదికి గండ్లుపడుతున్నాయని ఇకపై గండ్లుపడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి, సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, సంకురుడు, బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి నాగరాజు పాల్గొన్నారు

టీడీపీ నేత త్రిమూర్తులు పుట్టినరోజు వేడుక



గంటా త్రిమూర్తులను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

భీమవరం అర్బన్, జూలై 30: కృష్ణబలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, టీడీపీ బీసీ సాధికారిత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు పుట్టిన రోజు వేడుకను పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గంటాతో కేక్ కట్ చేసి తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ళ నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పొత్తూరి బాపిరాజు, చెన్నమల చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, మండల అధ్యక్షులు కౌరు పృథ్వీశంకర్, మైలబత్తుల ఐజాక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్స్ పంపిణీ

భీమవరం అర్బన్, జూలై 30 : పట్టణంలోని 2వ డివిజన్ పారిశుధ్య కార్మికులకు టీడీపీ పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు సౌజన్యంతో రెయిన్ కోట్స్, తోట సీతారామలక్ష్మి సహాయంతో దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్త తొలగించాలి

భీమవరం టౌన్, జూలై 30 : పట్టణంలో ఖాళీస్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో వేసిన చెత్తను తొలగించేందుకు వచ్చేనెల 10వ తేదీలోగా లక్ష్యంగా పెట్టుకుని పని ప్రారంభించాలని కమిషనర్ శ్యామల అధికారులను ఆదేశించారు. మంగళవారం వార్డు సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చెత్తను తొలగించిన ప్రాంతంలోని చుట్టుపక్కల వారికి నోటీసులు జారీచేసి ఆ స్థలంలో చెత్తవేస్తే జరిమానాలు విధించటంతోపాటు, కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పాలన్నారు. చెత్త తొలగింపుకు కావలసిన ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్స్, సిబ్బందిని పూర్తి స్థాయిలో అందిస్తామని అన్నారు. అదేవిధంగా ఎక్కడైన డ్రెయిన్‌ల ఏర్పాటు అవసరమైతే ప్రతిపాదనలు చెయ్యాలన్నారు. తప్పనిసరిగా అవుట్‌లెట్ ఉండే ప్రాంతాలను ప్రతిపాదించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శ్రీ విద్య పాల్గొన్నారు.

కుక్కలు బాబోయ్..



పాలకొల్లు అర్బన్, జూలై 30 : పట్టణంలో కుక్కలు, పందులు, ఆవులు పోటీపడి సంచరిస్తున్నాయి, దీనితో పాటు అపారిశుధ్యంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులు స్పీడ్ బ్రేకర్లుగా మారి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. రహదారులపై చిన్నారులు సంచరించడానికి భయపడే విధంగా కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. గతంలో కన్నా పందుల సంఖ్య కొంత తగ్గినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మాత్రం తిరుగుతూనే ఉన్నాయి. వీటితో పాటు వీధి పశువులు, కుక్కలను అదుపు చేయడం సాధ్యం కాలేదు. పారిశుధ్యం అధ్వానంగా మారడంతో పాటు దోమల బెడద పెరిగింది. అక్కడక్కడా పిచ్చికుక్కలు కూడా తిరుగుతున్నాయని, వాటిని ఆయా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

యలమంచిలి, జూలై 30: వరదప్రభావిత గ్రామాలైన వడ్డిలంక, యలమంచిలిలంక, కట్టుపాలెం, నార్నిమెరక, గంగడపాలెం గ్రామాల్లో వరదబాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఎన్డీఏ కూటమి నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు, అడబాల చిట్టిబాబు, మాధవరావు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటరు అందజేత

పెనుగొండ, జూలై 30: ఇలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న జాగర్లపూడి శ్రీదేవి పాఠశాలకు రూ.40 వేలు విలువ గల కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా కంప్యూటర్‌ను సంఘ సేవకులు కలగ వెంకట సత్య సాయిబాబా దంపతులు ప్రారంభించారు.

జనసేన సభ్యత్వాల నమోదు

నరసాపురం రూరల్, జూలై 30: మండలంలోని పసలదీవి, సారవ గ్రామాల్లో మంగళవారం జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే నాయకర్ సభ్యత్వకార్డులందించారు. ప్రతి ఒక్కరి చేత సభ్యత్వాలను నమోదు చేయించాలన్నారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయాలన్నారు.

ముస్లింల ఆర్థికాభివృద్ధే చంద్రబాబు ధ్యేయం: షరీఫ్

ఇరగవరం, జూలై 30 : ముస్లింలలో పేదరికాన్ని తగ్గించడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ అన్నారు. మంగళవారం తణుకు విచ్చేసిన ఆయనను ఎమ్మెల్యే ఆరిమిల్లి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ గత అయిదేళ్ళలో రాధాకృష్ణలేని లోటు తణుకు ప్రజలు తెలుసుకుని మళ్ళీ అఖండ మెజార్టీతో గెలిపించారన్నారు.

పేదలకు నిత్యావసరాల వితరణ

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 30: పేదలకు సాయం చేసేందుకు యువత ముందుకు రావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి సూచించారు. తాడేపల్లిగూడెంలోని వల్లి మోహన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఐదుగురు పేదలకు, బియ్యం, నిత్యావసర సరుకులను ఆయన మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు పటాన్ వల్లిని అభినందిం చారు. టీడీపీ జిల్లా నాయకులు వాడపల్లి వెంకట సుబ్బరాజు, దాసరి అప్పన్న, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గం

పాలకొల్లు టౌన్, జూలై 30: విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గమని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మంత్రి రామానాయుడు కళాశాలలోని అన్ని తరగతి విభాగాలను పరిశీలించారు. ల్యాబ్ శిథిలావస్థలో ఉందని, నాలుగు అదనపు తరగతి గదులు అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, కృష్ణాజిల్లా బీజేపీ ఇనిచార్జి ఉన్నమట్ల కబర్ధి, పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, ప్రిన్సిపాల్ వికె.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వరద ప్రాంత రైతులను ఆదుకోవాలి

పోడూరు, జూలై 30: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వరద ముంపుతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వ నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని కోరుతూ జిల్లా రైతు కార్యాచరణ కమిటీ చెర్మన్ పాతపాటి మురళీ రాజు, కమిటీ సభ్యులు మంగళవారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మంత్రి రామానాయు డుతో కలిసి వద్దిపర్రులో నక్కల డ్రెయిన్ ముంపు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం కొమ్ముచిక్కాలలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు కూడా వినతిపత్రం అందజేశారు

జనసేన సభ్యత్వ నమోదు



ఆచంట, జూలై 30: జనసైనికుల కుటుంబాలకు భరోసా కల్పించేలా క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతున్నదని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు జవ్వాది బాలాజీ అన్నారు. జనసేనపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక కచేరీ సెంటర్‌లో నిర్వహించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో సుమారు 7,800 పైగానే సభ్యత్వాలు తీసుకున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. వచ్చే నెల 5వరకు సభ్యత్వ నమోదు కు అవకాశం ఉందని తెలిపారు.

పేదల సొంతింటి కల టీడీపీతోనే సాధ్యం

భీమవరం అర్బన్, జూలై 30 : పేదవాడి సొంతింటి కల తెలుగుదేశంతోనే సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చే సరికి ఏశాఖ చూసినా అప్పులే కనపడుతున్నాయి తప్ప ఆదాయం లేదని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడటంతో పేదల ఆశలు చిగురించాయని, పేదవాడి ఆశల మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇళ్ల స్థలాలు లేని వారికి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2సెంట్లు అందజేయున్నట్లు తెలిపారు. సొంత ఇంటి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని వారికి ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. పేద మధ్య తరగతి వారికి రూ.4లక్షలు ఇంటి నిర్మాణానికి అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. జర్నలిస్టులకు కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వనుందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వైద్యుల వినతి

పాలకొల్లు అర్బన్/పెనుమంట్ర, జూలై 30 : తమకు పీజీలో ఇన్ సర్వీస్ కోటాలో 30శాతం క్లినికల్ సీట్లను, 50శాతం నాన్ క్లినికల్ సీట్లను కేటాయించాలని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న డాక్టర్లు మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందజేశారు. జీవో నెం 85 ద్వారా తాము నష్టపోతామని పేర్కొన్నారు. ఈసమస్యను సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రుల దృష్టికి తీసుకు వెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పోడూరు మండలం కొమ్ము చిక్కాల ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను క్యాంపు కార్యాలయంలో డాక్టర్లు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

భీమవరం టౌన్, జూలై 30 : జిల్లాలో రైతులకు దాళ్వా ధాన్యం సొమ్ము బకాయిలు ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి తోంట సత్యనారాయణ రాజు, కోశాధికారి కనుమూరి విశ్వనాథ సుబ్బరాజు, వైస్ ప్రెసిడెంట్ గంటా నాగరాజు కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ ఏడీ మాధురికి వినతి పత్రాన్ని అందించారు. ముందుగా కలెక్టర్ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 20 మండలాలకు సుమారు రూ.510కోట్లు రావాల్సి ఉందని అన్నారు.

ఈఆర్‌వో వ్యవస్థ నిర్వీర్యం తగదు



తాడేపల్లిగూడెంలో నిరసన తెలుపుతున్న అకౌంటింగ్ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 30: ఏపీఈపీడీసీఎల్ సంస్థ విద్యుత్ శాఖలో అత్యం త విశ్వసనీయమైన ఈఆర్‌వో వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని, ఆ ఆలోచన విరమించుకోవాలని విద్యుత్ అకౌంటింగ్ సిబ్బంది కోరారు. స్థానిక జువ్వలపాలెం విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. వినియోగదారులకు ఏళ్ల తరబడి నిష్పాక్షికంగా సేవలందించిన ఈ వ్యవస్థను నిర్వీర్యం చేయడం వల్ల ఇటు ప్రజలు, సిబ్బంది నష్టపోతారని అన్నారు.

భీమవరం టౌన్: విద్యుత్ శాఖ లోని అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ఇతర ప్రాంతాల్లోని సెక్షన్స్‌కు బదిలీ చెయ్యటంపై ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ (1104) ఆధ్వర్యంలో సంబంధి ఉద్యోగులు డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ తమను బదిలీ చెయ్యటాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సీఎండీ విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిరామకృష్ణంరాజు ఎ కృష్ణమూర్తి తోపాటు ఉద్యోగులు తదితరులుపాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం

అత్తిలి, జూలై 30 : బాల్యవివాహాలు జరగకుండా చూడాలని అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి అన్నారు. ఆరవల్లిలో మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై, బాల్య వివాహాల నిషేధ చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వీఎల్ఎన్ కుమారి, ఎస్ విజయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సీతారత్నం



నరసాపురం రూరల్, జూలై 30: నరసాపురం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బెజవాడ సీతారత్నం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నిమిత్తం ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ప్రసాద్ కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్లిపోయారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆమెను సిబ్బంది, వీఆర్వోలు అభినందించారు. బదిలీపై వెళ్లిన తహసీల్దార్ ప్రసాద్‌ను రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు

తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపాలి

నరసాపురం రూరల్, జూలై 30: లిఖితపూడిలో మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు మాట్లాడుతూ ఆడపిల్లలపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉన్నందున తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మాదక ద్రవ్యాలకు పిల్లల్ని దూరంగా ఉంచాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ



పాలకొల్లు అర్బన్, జూలై 30 : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజ రాజేశ్వరి అధ్యక్షత వహించారు. ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించి మాత్రమే వాహనాలు నడపాలని ప్రిన్సిపాల్ అన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ఆదాయ పన్నుపై అవగాహన

పాలకొల్లు, జూలై 30 : ఎంఎంకెఎన్ఎంహైస్కూల్లో మంగళవారం ఆదాయపు పన్ను, రిటర్న్‌లు దాఖలు, రిఫండ్ వంటి అంశాలపై ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ ఆర్ఎస్ఆర్ మూర్తి అవగాహన కల్పించారు. రిటర్న్ దాఖలుకు జూలై 31వ తేదీ వరకూ గడువు ఉందని సరైన ఆధారాలతో డిడక్షన్స్ క్లైమ్ చేయాలని సూచించారు. సరిగా క్లైమ్‌లు దాఖలు చేయకుంటే పెనాల్టీ, ఇంట్రస్ట్‌తో పాటు ప్రాసిక్యూషన్ వంటి వాటిని ఎదుర్కోవలసి వస్తుందని మూర్తి చెప్పారు. ఇన్‌స్పెక్టర్ గిరీష, ఆదాయపు పన్నురిటర్న్ దాఖలు చేసే ప్రక్రియను, పాత,కొత్త పన్నువిధానాలలో ఉండే వ్యత్యాసాలను వివరించారు.

రక్తదాన శిబిరం

పాలకొల్లు రూరల్, జూలై 30 : పాలకొల్లురోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉల్లంపర్రు సబితా మహిళా జూనియర్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. పాలకొల్లు వలంటరీ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుడు ముచ్చర్ల సత్యనారాయణ, ఆధ్వర్యంలో రక్తం సేకరించారు ఈకార్యక్రమంలో 16 మంది రక్త దానం చేశారు. సీనియర్ సభ్యుడు మద్దుల శశి కిరణ్ గుప్త 54వ సారి రక్తదానం చేసినందును గుప్తను పలువురు అభినందించారు

ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం: ఆరిమిల్లి



ఇరగవరం, జూలై 30: గత ఐదేళ్ల కాలంలో అభివృద్ధి కుంటుపడి రాష్ట్రం అధోగతి పాలైందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వమైనా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయాలని, కానీ గత వైసీపీ పాలనలో అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో వెటర్నరీ ఆస్పత్రి నిర్మించుకోవాలని, దువ్వలో మరో పీహెచ్‌సీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించిందని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ గ్రామ సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీ

పాలకొల్లు టౌన్, జూలై 30: ఆగస్టు నెల 1వ తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు సొమ్ములను లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తున్నట్లు పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ బి.విజయసారధి తెలిపారు. మున్సిపాలిటీలో ఉదయం 6గంటలు నుంచి పెన్షన్లను పంపిణీ చేయనున్నామని తెలిపారు.

ఇజ్రాయిల్ దురాక్రమణకు నిరసన

పెనుగొండ, జూలై 30: ఇజ్రాయిల్ దురాక్రమణ నుంచి పాలస్తీనాకు విముక్తి కల్పించాలని మండల సీపీఎం కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో పాలస్తీనా పై ఇజ్రాయిల్ దేశం దుర్మార్గపు దాడి, నరమేధం ఆపాలని పలువురు డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.